
ఆమె



సముద్రమంటే నాకు చాలా ఇష్టం.

ఈ ప్రపంచంలోని ప్రతి క్రియనీ సముద్రం చూపిస్తుందని నాకనిపిస్తుంది.

కడలి అడుగున ఎన్నో అంతర్మథనాలు జరిగితేనే ఉపరిభాగాన ఒక కెరటం ఉవ్వెత్తున లేచిరాదు... ఇది మనిషిలోని వ్యక్తిత్వాన్ని చూపుతుందని నేను నమ్ముతాను.

ముందుకురికి ఎగసిన కెరటం వెనక్కి పోవటం మనిషి ఆరాటానికి... నిరాశలకు ప్రతీక... అది చెలియలి కట్ట దాటినవాడు ప్రభంజనమై ప్రవహించే ప్రమాదసూచికలా మనిషి సహనం నిదర్శనం. చిన్న చేపల్ని పెద్ద తిమింగలాలు మింగుతూనే ఉంటాయి.

అందుకే నాకు సముద్రమంటే ఇష్టం !

రోజూ ఆ రెస్టారెంట్‌లోకి వెళ్లటం నాకలవాటు. దాని వెనుక గార్డెన్‌లో ఒంటరిగా బెంచిమీద కూచొని బీరు సిప్ చేస్తూ దూరంగా పొంగి పొర్లుతున్న సముద్రాన్ని గంటల తరబడి చూస్తూ గడపటం దినచర్యగా మారింది.

అంతస్తుకు కొరతలేకపోయినా పెంచినవాళ్ల ప్రేమ నిండుగానే వున్నా ఎక్కడో అవ్యక్తమైన వెలితి.... రోజూ నన్నిక్కడ కుచోబెడుతుందేమో?

సముద్రపు హోరు వింటూ... బీరుని సిప్ చేస్తూ కూచున్నాను. మత్తు మెదడులోంచి పాకి కళ్లలోంచి రాలిపడుతోంది. అప్పుడే నా పక్కకి ఓ వ్యక్తివచ్చి కూచున్నాడు. గత రెండు రోజులుగా అతడదే బెంచిపై కూచుంటున్నాడు. కడలివైపు చూస్తున్నాడు. బీరు మరోగ్లాసులో పోసి అందించబోయాను కంపెనీగా... నో థాంక్స్ అన్నాడు. నేను అతన్ని గమనిస్తు కూచున్నాను. పది నిమిషాల తర్వాత ముడతలుపడ్డ చెంపలమీదికి కన్నీరు కారి ఇరుక్కుపోయింది.

నాలో ఉత్సుకత... నావైపు నిర్లిప్తంగా చూసి తిరిగి కెరటాలవైపు చూశాడు. చిత్రమైన వ్యక్తిలా అన్పించాడు. అరగంట తర్వాత అతడు జేబులోంచి ఒక ఫోటో తీసాడు.

"ఈమె అడ్రస్ తెలీదు. ఈ పట్టణంలోనే వుంటుందట... మీరెప్పుడయినా చూశారా?" ఫోటోని నాకందించాడు.

ఆమెకు ఇరవై ఏళ్ళుంటాయేమో? అందంగా వుంది. అనుకున్నాను.

అకస్మాత్తుగా...

ఆ ఫోటోలో నాకు 'ఏదో' కన్పించింది.

ఏమిటది?

నిషా దిగిపోతోంది. దూరంగా సముద్రపు హోరు...

మెదడు నరాలు ప్రకంపిస్తూ బుర్రను బద్దలు చేస్తున్నట్టు... ఫోటోని తీక్షణంగా చూశా.

ఖచ్చితంగా ఆమె...!?

నమ్మలేను. కాని ఫోటో స్పష్టం చేస్తుంది. వయసులో వున్నప్పటి ఫోటో అది. అతడు నేలమీద ఏవో గీతలు గీస్తున్నాడు. ఆలోచనలు అణిచిపెడుతూ.

"ఈమె నీకేమవుతుంది!" అన్నాను.

"ముప్పయ్ ఎనిమిది సంవత్సరాల క్రితం ఆమె నా ప్రియురాలు..."

ముసలాయన మాట ప్రతిధ్వనించింది.

అర్థం చేసుకున్నాను. అసంకల్పితంగా వచ్చిన ఈ స్థితిని నమ్మడానికి నేను మరికొంత లాగాను.

"ఇప్పుడెక్కడనించి వచ్చావ్?" అనడిగాను.

"కరీంనగర్...."

"ఇప్పుడీమెతో నీకేం పని?" గొంతు తీవ్రతని పెంచి అడిగాను. సముద్రాని కభిముఖంగా నిల్చుని నల్లకోటు జేబులో చేతులు కుక్కి మౌనంగా వుండిపోయాడు. గాలికి తెల్లవెంట్రుకలు రెపరెపలాడుతున్నాయి. తర్వాత గంభీరంగా చెప్పాడు.

"నిజానికిప్పుడు నాకే లోటులేదు. ఆస్తికి కొదవలేదు. ముప్పయి ఎనిమిది సంవత్సరాలకింద ఆమె నన్ను విడిచివెళ్ళినప్పటినించి ఇప్పటి వరకూ పెళ్లి చేసుకోలేదు, నా వూర్లో అందమైన కుటీరాన్ని నిర్మించుకున్నాను. నెమళ్ళనీ, పావురాల్ని, జింకల్ని, కుందేళ్ళను పెంచుతూ వాటితో సహజీవనం గడపాలని చూశాను. అయినా ఏదో వెలితి... ప్రతి క్షణం ఆమె గుర్తుకొచ్చేది. ఈ వయసులో ఇంకా ఆమె జ్ఞాపకాలు నన్ను చిత్రవధ చేస్తున్నాయి.

ఒంటరితనం నన్ను పీక్కుతింటోంది. రోజురోజుకూ మనశ్శాంతి కరువైంది. ఆమెకోసం... ఆగలేక కదిలాను. బంధుమిత్రుల సాయంతో పద్దెనిమిది రోజులు గాలించి చివరికి ఈ పట్టణంలో వుందని తెలిసి రెండురోజులుగా వెతికి అలసిపోయాను..." ఆయన గొంతు ఆగిపోయింది.

"ఆమె కన్పిస్తే ఏం చేస్తావ్?" నేనడిగాను.

"నాతో వస్తే తీసుకెళ్తాను. లోకం దృష్టిలో తప్పయినాసరే ఊహ తెలీని వయసులో ఆమెను పోగొట్టుకున్నాను. ఈ మృత్యుముఖంలో నరకయాతన నన్ను కోతపెడుతోంది బాబూ..." నా చేతుల్ని పట్టుకొని బావురుమన్నాడు.

అరగంటసేపు అయోమయంలో పడ్డాను. మా ఇంటి పరిస్థితులు సినిమా రీళ్లలా కదిలాయి.

"ఈమె నాకు తెలుసు" అన్నాను నిబ్బరంగా.

ఆయన ముఖం ముత్యంలా వెలిగిపోయింది. నమ్మలేదేమో నా భుజం పట్టి కుదిపాడు.

"అవునూ... ఈమె నాకు తెలుసు" దృడంగా చెప్పాను.

చేతిలో చెయ్యేసి "ముందు నువ్వు నీ వూరెళ్ళిపో... వారం రోజుల్లో ఆమె నీ కుటీరంలో వుంటుంది." అన్నాను.

కళ్ళు కాంతవంతం కాగా విజిటింగ్ కార్డ్ తీసి నాచేతిలో పెట్టాడు. ఫోటోని, కార్డుని, జేబులో పెట్టుకొని అక్కడ్నించి కదిలాను. వెనకనించి అతడు పిలుస్తున్నా ఆగలేదు!

***　　****　　****

ఇంటికి చేరేసరికి, రాత్రి తొమ్మిదయింది. లంకంత కొంపలో ఎప్పుడూ నిశ్శబ్దమే! నాకు వూహ తెలియని వయసులోనే ఈ ఇంటికి నేను దత్తపుత్రుడిగా వచ్చానని తెల్సినపుడు ఈ అమ్మానాన్న నన్ను ఏమాత్రం అలక్ష్యం చేసినా

విపరీతంగా బాధపడేవాణ్ణి. ఎనిమిది మందిని కన్న మా అమ్మనించి పాలు మరువకముందే వీళ్లు నన్ను దత్తత తెచ్చుకున్నారట. మాకు దగ్గరి బంధువులే అయినా... ఎదుగుతున్నకొద్దీ వీళ్ల మధ్య సర్దుకోలేకపోతున్నాను. అలా ఇరవై అయిదేళ్ల వాడినయ్యాను.

క్షణాలమీదే నిర్ణయం తీసుకునే మనస్తత్వం నాది. ఈ ఇంటిని వదిలి మాఇంటికి పోవాలనే ఒక్క నిర్ణయంలో మాత్రం ఇన్నాళ్లూ రాజీపడుతూనే వున్నాను. ఎందుకో నాకే తెలీదు.

సైలంట్‌గా డైనింగ్ టేబుల్‌ముందు కూర్చున్నాను. అమ్మ వడ్డిస్తోంది. ముఖంలోకి చూశాను. ఆశ్చర్యంగా చూసింది. నాచూపుకు అమ్మ ముఖంలో ఇప్పుడు కొత్తగా కన్పించేది 'మచ్చ' ఒక్కటే.

"ఆయన లేరా?" అన్నం కెలుకుతూ అడిగాను. అతన్ని నాన్నా అని ఎప్పుడూ పిలవలేదు. నాకసహ్యం. పగలు ఈ ఇల్లు ఒక క్లబ్బులా వుంటుంది. పేకాటలు... సారాలు... కొన్ని సమయాల్లో ఎవర్తినో వెంట తీసుకొని వ్యభిచారం కూడా జరుగుతుంది.

ఒకరోజు పార్టీలో కూచున్నవాళ్లందరికీ సమయానికి కారప్పూస అందలేదని అమ్మని తన్నితే ఫలితంగా నుదుటిమీద మచ్చ...

అతని చేతిలో అమ్మ చావుదెబ్బలు తినని రోజులేదేమో? నాలుగేళ్ల కిందట నాముందే విపరీతంగా సిగరెట్లతో కాల్చాడు. నాకు తెల్సినంతవరకూ తొమ్మిదేళ్ళలో అతడు అయిదు సానికొంపల్లో కాపురం పెట్టాడు. తప్ప తాగి ఏ అర్ధరాత్రికో

ఇంటికి చేరతాడు. అమ్మ రాత్రిళ్ల ఏడ్చేది. డాబా మీద పడుకొని చుక్కల్ని లెక్కిస్తు ఆమె ఏడ్పుని వింటూ పడుకొనేవాణ్ణి. ఒక్కోరోజు ఇద్దరు ముగ్గురు ఆడాళ్ళతో ఈ ఇంట్లోనే రతిక్రీడలు జరుపుతుంటే చూడలేక డాబామీదికొచ్చి నా ఒడిలో తలదూర్చి ఏడ్చేదామె.

కిందినించి నవ్వులు విన్పించేవి. నారక్తం సలసలా ఉడికిపోయినా... ఈ ఇంటికి నేను దత్తపుత్రుడిని అనే విషయం అనుక్షణం గుర్తుకువెచ్చుకువచ్చేది!

ఈ ఆలోచనల్తో నాకు అన్నం సయించలేదు. గార్డెన్‌లో ముసలాయన గుర్రొస్తున్నాడు. లేచి డాబామీదికెళ్లి పడుకున్నాను.

వెన్నెల వెలుగులో వెక్కిళ్ళతో కూడిన సన్నటి ఏడ్పు.....

"మళ్ళీ ఏమైందమ్మా...?" అనునయంగా అడిగాను. అమ్మ బావురుమంది. "నలుగురు నాలుగు మాటలంటుంటే వినలేకపోతున్నాను బాబూ... ఈ వయసులో ఆయన చేష్టలు మరీ మితిమీరిపోతున్నాయి" అంది వెక్కిళ్ల మధ్య.

"ఇప్పుడేం జరిగిందని"

"వూర్లోకి కొత్తగా వచ్చిన నర్స్‌తో..." చెప్పలేక గొంతు పూడుకుపోయింది. అతని ఈ విషయాల్లో నెనిప్పటివరకూ నిస్సహాయుడిగానే వుండిపోయాను. ఎదిరించే శక్తివున్నా... ఎందుకో నేనీ ఇంటికి స్వంత మనిషినికాదన్న భావం... ఎదిరించలేకపోయింది.

"అది ఆయనకున్న పాతరోగమే..." మామూలుగా చెప్పాను.

"ఆయన సహచర్యంలో గడిపి పద్నాలుగేళ్ళు దాటిందిరా..." రుద్ధమైన కంఠంతో అనంతమైన ఆవేదన గొంతులో సుళ్ళు తిరుగుతోంది. నా మనసు బాధతో చివుక్కుమంది. ఆమె మనసు ఎంతగా క్షోభపడితే ఆ మాట తనతో చెప్పుకుంది?

ఇన్ని దౌర్జన్యాలు చేసినా మగాడు దగ్గరకు తీస్తాడనే ఆశ మన స్త్రీలకు సాంప్రదాయంతో వచ్చిందేమో?

"నాకు బ్రతకాలని లేదురా..." అమ్మ ఏడ్పు కట్టలు తెంచుకుంది. ప్రక్కబట్టలు తడిసిపోయేలా ఏడ్చింది.

కన్నీళ్లు ఎండిపోయి గుండె తేలికపడ్డాక ఏదో చెప్పబోయాను. కింద తలుపు చప్పుడయింది. అమ్మదిగి వెళ్ళి తలుపు తీసిందో లేదో దడదడమని కొట్టిన చప్పుడు. అమ్మ మొత్తుకుంది. మరో స్త్రీ గొంతుకూడా విన్పిస్తే నేను కిందికి దిగాను. అపాటికే వాళ్ళిద్దరు గదిలో చొరబడి సరసాల్లో పడ్డారు. అమ్మనోట్లో కొంగుకుక్కుకుని ఏడుస్తూ డాబాపైకి పరిగెత్తింది. ఏడుస్తూనే చాలాసేపటికి నిద్రబోయింది. చుక్కల్లోకి చూస్తూ నేనూ పడుకున్నాను. ఆరాత్రి... ఎంతకీ నిద్రరాలేదు.

*** **** ****

రైల్వే స్టేషన్‌లో నూట పన్నెండోసారి అమ్మ అడిగింది.

"ఎక్కడికిరా...."

నే చెప్పలేదు. రైలొచ్చింది. సెకండ్‌క్లాస్ కాంపార్టుమెంట్‌లో కూచున్నాం.

రైలు కూతేసి కదిలింది. దడదడ చప్పుళ్ళతో ఆ వూరివొదిలి వేగాన్నిందుకొంది. ఏమనుకుందో అమ్మ కిటికీలోంచి వేగంగా వెనక్కి పోతున్న ప్రకృతిని చూస్తూ మౌనంగా కూచుంది.

కంపార్టుమెంట్‌లో జనం పల్చగా వున్నారు. అరగంట గడిచినా అమ్మ మళ్లీ అడగనేలేదు. ఆఖరిచూపు అనుకుంటూ అమ్మను తదేకంగా చూస్తున్నాను. తలతిప్పి చూసి నవ్వింది.

చాలారోజుల తర్వాత నిర్మలమైన నవ్వుని చూసాను.

"ఎక్కడికిరా మనం పోయేది" అంది మళ్ళీ.

"అమ్మా... నన్ను కోపగించుకోవు కదూ?"

ఆ నవ్వు మోముమీద చెదిరిపోలేదు. "వూహూ" అంది.

"అమ్మా... నీకు మహేంద్రనాథ్ తెలియదా?"

గతం తాలుకు స్మృతులేవో కదలాడి క్షణంపాటు కలవరడింది. ఇబ్బందిగా కూచొని ఇంకేం అడగలేదు. నాకు తెలుసు. ఈ సమయంలో ఆమె గొంతు పెగలదు. నేను కూడా మౌనంగా కూచున్నాను.

అమ్మ కనుకొలుకుల్లోంచి వేగంగా కన్నీళ్ళు జారిపడుతోంటే... అంతకంటే వేగంగా రైలు వూపందుకుంది.

*** **** ****

మూడు రోజుల తర్వాత మళ్లీ మా వూర్లో దిగాను. కొందరు వ్యక్తులు

అప్పటికే నన్ను ఎగాదిగా చూస్తున్నారు.

కొందరు ముసిముసిగా నవ్వారు.

కొందరు జాలిగా నవ్వారు.

ఒక పెద్దమనిషి నా దగ్గరకొచ్చి "నీకు తెలుసా బాబూ?" అన్నాడు. ఏమిటి అని రెట్టించగానే కామ్‌గా వెళ్ళిపోయాడు. నాకు పరిస్థితి అర్థమైంది. అమ్మగురించి ఈపాటికి వూరంతా గుప్పుమని వుంటుంది. ఆలోచిస్తూ అడుగులేస్తున్నాను.

గాంధిబొమ్మ దగ్గర, మంచినీళ్ళ బావికాడ అమ్మలక్కలు నన్ను చూసి చెవులు కొరుక్కుంటున్నారు.

"ఈయనగారికి తెలుసో... లేదో.... సావిత్రమ్మ లేచిపోయిందని... దీర్ఘాలు తీసింది. ఒకావిడే.

"పెళ్ళికెదిగిన కొడుకుండగా... ఈ వయసులో ఇదేం పాడుబుద్ధి" ఒకామె నావైపు ఓరగా చూస్తూ అంది.

"పూజలు పునస్కారాలు బాగానే చేసేది. పతిభక్తే అనుకున్నాను" ఒకావిడ జాలిపడింది. "ఆ... పసుపు రాసుకున్న వాళ్ళంతా పతివ్రతలేనా ఏమిటి?" అనుమానాన్ని వ్యక్తం చేసింది ఒకావిడ.

"మగడలా వెధవ్వేషాలేస్తే ఆవిడ మాత్రం ఏంచేస్తుంది? తగినబుద్ధి చెప్పిందిలే" ఒక అమ్మాయి సమర్థించింది.

"కట్టుకున్న పాపానికి కట్టుబడి వుండాల్సిందే. ఈ వయసులో లేచిపోవటం

అంటే ఎంత కండకావరం వుండాలి..."

"ఈ మహాశయునికి తెలుసోలేదో మరి... తెల్సినా ఏం చేస్తాడులే దత్తపుత్రుడు కదా!"

"సావిత్రమ్మ మొహం చూస్తే మాత్రం లేచిపోయేదని ఎవరు అనుకోరు."

నాచెవులు చిల్లులుపడుతున్నాయి. ఫర్వాలేదు. కాని ఇంతకంటే నూరురేట్లుగా అతని (నాన్న) గుండె తూట్లుపడాలి. అమ్మని చిత్రహింసలు చేసిన పాపానికి అతడు ప్రతిక్షణం కృంగిపోవాలి.

తప్పకుండా ఈ మూడు రోజుల్నించి అతడు సూటిపోటి మాటల్ని పడేవుంటాడు. తలెత్తుకు తిరగలేడు. జీవిత చరమాంకంలోనైనా అమ్మ మనశ్శాంతిగా బ్రతకాలి. నా నిర్ణయంలో తప్పులేదని నాకు మాత్రమే తెలుసు. ఆమె పయనానికి కారణం నేనే అన్నది ఈ వూర్లో ఎవరికి తెలియదు.

ఆలోచిస్తూ నడుస్తున్న వాడినల్లా ఆగిపోయాను. ఆ ఇంటిముందు జనం గుమిగూడి వున్నారు. నా భృకుటి ముడిపడింది. అంతా మౌనంగా చిత్రంగా నావైపు చూస్తూ దారిచ్చి ప్రక్కకు తప్పుకుంటున్నారు. గబగబా లోపలికొచ్చాను.

నట్టింట్లో నాన్న శవం సీలింగ్‌ఫ్యాన్‌కు వేలాడుతోంది. హృదయ విదారకంగా నాలుక బయటికి వచ్చింది. ఆ దృశ్యం నన్ను కదిలించలేదు. కళ్ళయినా చెమ్మగిల్లలేదు.

"ఎలా జరిగింది?" ఒకాయన్ని అడిగాను.

ఆయనను వాడుకొన్న వాళ్ళెవరూ అక్కడికి రాలేదు.

"నీకు తెలీదా బాబు... ఆమె లేచిపోయింది."

"అయితే...?" అని మామూలుగా అనటంతో అందరూ విచిత్రంగా చూసారు.

"పరువుగల మనిషి, ప్రాణం ఆపుకోలేకపోయాడు పాపం" అక్కడ జాలికురుస్తోంది.

"రెండు రోజులు ఊరంతా నిలదీస్తే సిగ్గుతో చచ్చిపోయాడు. ఈ రోజు నిజంగానే చచ్చిపోయాడు"

"ఎంతైనా ఈ వయసులో పెండ్లాం మరొకడితో లేచిపోయిందంటే ఎలా బ్రతుకుతాడు?" అతడి 'పురుషహంకారానికి' నాకు నవ్వొచ్చింది. విరగబడి నవ్వాను... పగలబడి నవ్వుతున్నాను. విజయగర్వంతో నవ్వుతున్నాను.

అంతా విస్తుపోయి చూస్తున్నారు.

* * *